

ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లూరు: మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక పరిపుష్టి లక్ష్యంగా ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. శనివారం నగరంలోని రంగనాయకులపేట గొల్లవీధి వద్ద సచివాలయంలో బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ మహిళలందరూ స్వయం ఉపాధి పొందాలని, స్వశక్తితో గౌరవంగా జీవించాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత టైలరింగ్ కేంద్రాలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని మంత్రి నారాయణ చెప్పారు. ఉచితంగా 90 రోజులపాటు టైలరింగ్ శిక్షణ ఇచ్చి మహిళలకు ఉచితంగా కుట్టుమిషను అందజేయనున్నట్లు చెప్పారు. ఈ శిక్షణ కేంద్రంలో 70 మందికి రెండు బ్యాచ్ లుగా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. . మున్సిపల్ కమిషనర్ నందన్, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, స్థానిక ప్రజా ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

'మైనింగ్'లో అధికారులే సూత్రధారులు..?

"అందరూ తాబాహారులే...కుండలో చికెన్ మాయమైపోతోంది" అన్నట్లు అధికార తెలుగుదేశంపార్టీ, ప్రతిపక్ష పార్టీ వైసిపినేతలు ఇద్దరు మైనింగ్ విషయంలో నిజాయితీపరులుగానే చెప్పుకుంటున్నారు.. వైసిపి, ఇప్పుడు టిడిపి ప్రభుత్వంలోనూ తెల్లరాయి మాత్రం సరిహద్దులు దాటిపోతూనే ఉంది. జిల్లాను, రాష్ట్రంలో ప్రధాన చర్చగా సాగుతోన్న మైనింగ్ వ్యవహారంలో ఆశాఖ అధికారుల పాత్రపైనే అందరికీ అనుమానం వస్తుంది.. ఇంత రాద్ధాంతం జరుగుతుంటే వాస్తవాలు చెప్పడానికి ఆశాఖ అధికారులు బయటకు రావడం లేదు..జిల్లాలో ఎన్ని మైన్లకు అనుమతులున్నాయనే విషయం కూడా ఇప్పటికీ స్పష్టంగా లేదు... మీడియాకు సమాచారం ఇవ్వరు.... ఇదిగో అదిగో అంటూ తప్పించుకు తిరుగుతున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆపార్టీకి మైనింగ్, పోలీసు, రెవెన్యూ, ట్రాన్స్‌పోర్టు అధికారులు భజన చేస్తున్నారు. ఇప్పటికే మైనింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వ్యవహారం కోర్టులో ఉంది. ఆయన అండర్ గ్రౌండ్‌కు వెళ్లిపోయారు. మరో మాజీ మంత్రి అరెస్ట్ సన్నాహాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. ఇంత రచ్చ జరుగుతోన్న మైనింగ్ అధికారులు మాత్రం నోరు మెదపడం లేదు. వాస్తవ పరిస్థితులు ప్రజలకు చెప్పడం లేదు.....

- ఒక్క రికార్డు బయట పెట్టరు..
- అధికారపార్టీలకు వత్తాసు
- వైసిపి, టిడిపి నేతలు ఇద్దరు ఉత్తములే
- తెల్లరాయి మాత్రం తరలిపోతూనే ఉంది ..

సైదాపురంలో మైనింగ్ జరుగుతోన్న ప్రాంతం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సైదాపురం, పొదలకూరు, ఉదయగిరి ప్రాంతాల్లో తెల్లరాయి తరలిపోతూనే ఉంది. జిల్లా వ్యాపితంగా 200 మైన్లకు గతంలో అనుమతులుండేవి. ఆరేళ్లకు ముందు ఎవరి మైన్లు వారు చేసుకునేవారు. వైసిపి అధికారంలోకి వచ్చాయక చైనాలో తెల్లరాయికి డిమాండ్ పెరగడంతో అందరి దృష్టి మైనింగ్‌పై పడింది. సిఎం కార్యాలయం నుంచి జిల్లాలోని మంత్రులు, ఎంఎల్ఎలు, స్థానిక నాయకులు పెద్ద ఎత్తున అక్రమ మైనింగ్ చేశారని తెలుస్తోంది. గత ప్రభుత్వంలో కొందరు నేతలు బాగానే వెనకేసుకున్నారనే విమర్శలున్నాయి. అప్పట్లో టిడిపి నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తోపాటు, మీడియా ఈ వ్యవహారంపై పెద్ద ఎత్తున కథనాలు రాశారు. ఆరోజు మైనింగ్ అధికారులు నోరు మెదపలేదు. వాస్తవ పరిస్థితులు ప్రజల ముందు ఉంచడానికి సిద్ధపడలేదు. అప్పటి వైసిపి ప్రభుత్వంలోని పెద్దలు సిఎం కార్యాలయం వేదికగా అవినీతికి తెరతీశారు. రెవెన్యూ, మైనింగ్, పోలీసులను చేతిలో పెట్టుకొని సైదాపురం నుంచి చైనాకు భారీగా తెల్లరాయి అమ్ముకున్నారు. ఏడాది కాలంలో సుమారు సుమారు రూ.5 వేల కోట్లు వరకు తరలిపోయిందనే ప్రచారం జరిగిందనే ప్రచారం ఉంది. మైనింగ్ లీజ్ దారులను బెదిరించి తరిమేశారు. ప్రభుత్వం, ప్రయివేటు, పట్టా, భూమి ఏక్కడ కనిపిస్తే అక్కడ తవ్వకాలు చేశారు. పంపకాల వద్ద వైసిపి నేతల మధ్య రగడ సాగింది. ఎన్నికలకు ఆర్నెల్ల ముందు 'ప్రజాశక్తి'తోపాటు అనేక పత్రికలు ఇక్కడ అవినీతిని వెలికి తీశాయి. రాష్ట్రమంతా చర్చసాగింది. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఇంత జరిగినా ఏ రోజులు ఆశాఖ అధికారులు నుండి సమాధానం రాలేదు. ఆశాఖలో పనిచేసే కొందరు అది ,కారులు అధికారపార్టీకి మడుగులొత్తారని ప్రచారం ఉంది. మీడియా సమాచారం అడిగినా ఏ రోజూ చెప్పలేదు. వాస్తవ పరిస్థితులను ప్రజల ముందు ఉంచడానికి సాహసించడం లేదు..

'మైనింగ్' అధికారులే సూత్రధారులా..?

వైసిపి ప్రభుత్వంలో జరిగిన మైనింగ్ బాగోతం మరవకముందే , టిడిపి అధికారంలోకి వచ్చాక అప్పుడు సైదాపురం మైనింగ్‌లో ఏం జరిగిందో ఇప్పుడు అదే జరుగుతుందనే విమర్శలున్నాయి. ఎన్నికల ముందు ఉండగానే ఇలా ఉంటే అనంతరం మైనింగ్ లీజుకు ప్రభుత్వం రద్దు చేసింది. నూతనంగా చట్టం తీసుకొచ్చి సహజవనరులు దోపిడీ జరగకుండా చూస్తామంటూ చెప్పుకుంది. వైసిపి ప్రభుత్వంలో ఒరిజినల్ మైనింగ్ లీజ్‌దారులు పెద్ద ఎత్తున నష్టపోయారు. ప్రభుత్వం మారితే మా పరిస్థితి మారుతుందని ఆశపడ్డారు. ప్రభుత్వం బోర్డు మారింది తప్ప, పరిస్థితులు అలాగే కనిపిస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి. సైదాపురం మైనింగ్‌లో ఎన్ని వేల కోట్లు తెల్లరాయి ఉందో అంతుపట్టడం లేదు. ఎక్కడ తవ్వినా తెల్లరాయిగా మారే. చైనాలో దీని గిరాకీ రోజు రోజుకు పెరుగుతోంది. టిడిపిలోని కొందరు ప్రజా ప్రతినిధులు,నేతలు వ్యూహరచన చేశారు. ప్రస్తుతం 30 కంపెనీలకు అనుమతులు ఉన్నాయని తెలుస్తోంది. ఈ విషయాలను మైనింగ్ అధికారులు ఏ రోజూ సక్రమైన రికార్డులను మీడియాకు ఇవ్వలేదు. ఎప్పుడు ఫోన్ చేసినా మైనింగ్ అధికారులు ..తెలియదు..కాదు..లేదు అని చెప్పడంతోపాటు ఆఫీసుకు రండి అని చెప్పి ఫోన్లు పెట్టేస్తున్నారు. ఆఫీసుకు వస్తే సార్ లేరు. ఇంకా రాలేదు.. మరోసారి రండి మేం ఇవ్వకూడదు ...అంటూ సమాచారం దాటవేస్తునే ఉన్నారు..

అసలు సైదాపురం మైనింగ్‌లో ఏం జరుగుతుంది. ఏది నిజం తెలియడం లేదు. మాజీ మంత్రి అనిల్‌కుమార్ ఇటీవల 30 కంపెనీలకే అనుమతులు ఇచ్చారు. రెండు కంపెనీలు ఎగుమతులు చేస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం రూ.1500 కోట్లు విలువైన తెల్లరాయి ఎగుమతికి సిద్ధంగా ఉందని చెప్పారు.. ఈ వ్యవహారంలో తనిఖీలు నిర్వహించి ప్రజల, ప్రభుత్వ ఆస్తులు కాపాడాల్సిన మైనింగ్ అధికారులు తమ వాటాలు తీసుకొని మౌనంగా ఉంటారనే ప్రచారం పెద్ద ఎత్తున సాగుతోంది. తిరుపతి ప్రాంతం నుంచి వచ్చే ఓ మైనింగ్ అధికారి మీడియాకు, సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండరనే ప్రచారం ఉంది. అధికారపార్టీకి చెందిన ఓ నాయకుడు ఆ అధికారిని ప్రత్యేకంగా ఇక్కడకు తెప్పించుకున్నారని జిల్లాలో మైనింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కేసులు ఎదుర్కొంటున్నారు. మరో మాజీ మంత్రి అరెస్టు తప్పదని అంటున్నారు. ప్రస్తుతం ఉన్న ఎంపి, ఎంఎల్ఎ, ఇతర ప్రజా ప్రతినిధులు విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమయంలో మైనింగ్‌లో ఏం జరుగుతుందనే వాస్తవాలను బయట పెట్టడానికి అధికారులు ఎందరుకు నోరు విప్పడం లేదో డాలర్ల ప్రశ్న అందరినీ వెంటాడుతోంది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని మైనింగ్ విషయంలో ఆశాఖ అధికారుల పాత్ర ఏమిటో తేలాల్సి ఉంది.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె అజయ్‌కుమార్

ప్రజాశక్తి-నెల్లూరు : కార్మిక హక్కుల పరిరక్షణకు 20వన కార్మికుల సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్ పిలుపు నిచ్చారు. శనివారం ఎసి మార్కెట్ హమాలి వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఏసీ మార్కెట్ లోని హమాలీ వర్కర్స్ విశ్రాంతి గది నందు జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సిఐటియు జిల్లా, రూరల్ కార్యదర్శులు కె. అజయ్ కుమార్, కె. పెంచల నరసయ్య మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మార్పు చేసి, 4 చట్టాలుగా తేవడం వల్ల కార్మికుల హక్కులు హరించబడతాయన్నారు. వేతనాలు పెంచుకునే దానికోసం పనిగంటలు, సమ్మె చేసే హక్కును కాలరాసే విధంగా కార్మిక చట్టాలు మార్పులు చేస్తున్నారు. కార్పొరేట్ శక్తులకు,

బుక్ లెట్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పెట్టుబడిదారులకు అనుకూలంగా, కార్మిక ఉద్యమాలను తీవ్రంగా అణిచివేయాలనే ఉద్దేశ్యంతో కార్మికుల హక్కులను హరించే విధంగా కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాలను అమలులోకి తీసుకొచ్చిందన్నారు.వీటిని తిప్పికొట్టాల న్నారు. సిఐటియు నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, రూరల్ అధ్యక్షులు కొండా ప్రసాద్, యూనియన్ నాయకులు అంజిరెడ్డి, నాగిరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ రెడ్డి, నారాయణ, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి : యుటిఎఫ్

12న డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-నెల్లూరు : పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో లోపాలు, ఉపాధ్యాయుల ప్రమోషన్స్ బదిలీలలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు వెంటనే ఉత్తర్వులను వెంటనే విడుదల చేయాలని యుటిఎఫ్ ఈనెల 12వ తేదీ జిల్లా విద్యాశాఖ అధికారి వారి కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జివి చలపతి శర్మ పేర్కొన్నారు. శనివారం జిల్లా విద్యాశాఖ అధికారిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు నాయకులు మీడియాతో మాట్లాడుతూ డైట్ లో డిప్యూటేషన్ పై పని చేస్తున్న ఉపాధ్యాయులకు రీ పోస్టింగ్ ఆర్డర్, మిగులు ఉపాధ్యాయులు లేని పాఠశాలలకు వీరిని కేటాయించమని రాష్ట్ర ఉన్నతాధికారులకు సూచన

డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చేసి ఉన్నారు కానీ డీఈఓ గారు పై అధికారుల ఉత్తర్వులను అమలు పరచ కపోవడం వలన ప్రస్తుతం పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులు మిగులు ఉపాధ్యాయులుగా సుదూర ప్రాంతాలకు వెళ్ళవలసి వస్తున్నది. దీనిని సవరించి ఉత్తర్వులు ఇవ్వాలని యుటిఎఫ్ జిల్లా శాఖ పక్షాన డిఈఓని కోరుతున్నామన్నారు. అధిక సంఖ్యలో కార్యకర్తలు, ఉపాధ్యాయులు నాయకులు హాజరై జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జీవి చలపతి శర్మ కోరారు.

ప్రజలను మభ్యపెడుతున్న ప్రభుత్వం : వైసిపి

ప్రజాశక్తి-నెల్లూరు : సిఎం చంద్రబాబు నాయుడు ఏ పథకం తలపెట్టినా దానివెనుక స్కామ్ తప్పకుండా ఉంటుందని వైసిపి మహిళా జిల్లా అధ్యక్షురాలు సునంద ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. రూ. 221 కోట్లతో కూటమి ప్రభుత్వం కుట్టుమిషన్లు పంపిణీ కార్యక్రమం చేపట్టిందని, 1,02,832 మంది మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి కుట్టు మిషన్లు అందించే పేరుతో చేపట్టిన స్కీమ్‌లోదాదాపు రూ.154 కోట్లకు పైగా దండుకోవడానికి సిద్ధమైందని ఆరోపించారు. జిల్లా అంగన్వాడీ వింగ్ అధ్యక్షురాలు శ్రీమతి పాల లావణ్య , రూరల్ మహిళా విభాగం అధ్యక్షురాలు పి. రమాదేవి , మహిళా నాయకురాళ్ళు భేషీరా , హైమవతి , నర్మదా ఉన్నారు.

మాట్లాడుతున్న వైసిపి మహిళా నాయకులు

ప్రచార ఆర్భాటం

ప్రచార ఆర్భాటాలు తప్ప.. మంత్రి నారాయణ నెల్లూరు నగరానికి చేసిందేమీ లేదని వైసిపి జిల్లా యువజన అధ్యక్షులు , కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున ధ్వజమెత్తారు. శనివారం నగరంలోని వైసిపి నగర నియోజకవర్గం కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. .తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి లాంటి పథకాలు అమలు చేసి.. అప్పుడు టిడిపి నేతలు మాట్లాడాలని హితవు పలికారు.

పివి రావుకు నివాళి

ప్రజాశక్తి-కందుకూరు : మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ. పివి రావు 76వ జయంతి సందర్భంగా కందుకూరు అంబేద్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి కట్టా. రమేష్ అధ్యక్షత వహించగా. చెక్క సింగయ్య, డిసిహెచ్ మాలకొండయ్య, మద్దాల రామారావు, మెడబలిమి శ్రీనివాసులు, పొనుగోటి ప్రభాకర్, జంగాల శ్రీమిత్ ,పంది కోటేశ్వరరావు, బడుగు నరసింహం, మన్నెం కిరణ్ కుమార్, కట్టా. రమేష్. నల్లపు చంద్రశేఖర్, దాసరి రమణయ్య, లోకేంద్ర, చిరంజీవి, లింగాబత్తిన బాలాజీ, సామాజిక వేత్తలు పాలేటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉండవల్లి శ్రీదేవిని కలిసిన మోషే

ప్రజాశక్తి-కందుకూరు : రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవిని తాడేపల్లిలోని మాదిగ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే కలిసారు. చైర్మన్ శ్రీదేవితో మోషే మాట్లాడుతూ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇవ్వనున్న సబ్సిడీ రుణాలలో మాదిగలకు అధికశాతం అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు.ఉలవపాడు మండలం తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం నవీన్ ఉన్నారు.

ఆర్‌టిసి డిపోలో పరిశీలన

ప్రజాశక్తి-కందుకూరు : ఆర్‌టిసి నెల్లూరు జోన్ చైర్మన్ సన్నపరెడ్డి సురేష్ రెడ్డి శనివారం కందుకూరు ఆర్టిసి డిపోని సందర్శించారు. ఈ సందర్భంగా డిపోలోని గ్యారేజ్ సెక్షన్, బస్టాండు మొత్తాన్ని పరిశీలించారు. ఆయనకు కందుకూరు డిపో లోని ప్రధాన సమస్యలు గురించి వివరించారు. అధిక వర్షాలు కురిస్తే వాటర్ డిపోలో నిలుస్తుందన్నారు. సిబ్బంది రెస్ట్ రూమ్ గురించి చైర్మన్ సురేష్ రెడ్డి దష్టికి తీసుకెళ్లారు. సమస్యలు పరిష్కరించాలని సిబ్బంది కోరారు. ఇన్‌చార్జి డిపో మేనేజర్ ఆర్ శ్రీనివాసరావు,ఎంఎఫ్ రాజ్యలక్ష్మి ,అసిస్టెంట్ మేనేజర్ ప్రసాదు, సిబ్బంది ఇబ్రహీం, ఎంయస్ రాజు, కొండలు, మహేష్ ,రహమతుల్లా, సుబ్బారావు ,గంగాధర్ ,కోటయ్య ,శీను, ఎస్ డబ్ల్యూ ఎఫ్ నాయకులు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మదర్స్ డే

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్ట్ బి సెక్టార్ లోని యానాది పాలెం అంగన్వాడి కేంద్రంలో సిడిపిఓ శర్మిష్ఠ ఆదేశాల మేరకు మదర్స్ డే శనివారం జరిగింది. అందులో భాగంగా సూపర్‌వైజర్ ఎల్ లక్ష్మీదేవి మాట్లాడుతూ మదర్స్ డే అనేది కుటుంబం లేదా వ్యక్తి యొక్క తల్లి మాతత్వం ,మాత బంధాలు సమాజంలోని తల్లుల ప్రభావాన్ని గౌరవించే వేడుక అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు బల్లిపల్లి పద్మావతి ,ఎస్.కె రహంతున్సీసా, ఎం అంజలి పాల్గొన్నారు.



వైసిపి శ్రేణులతో 'బుర్రా' భేటి

-కందుకూరు : కందుకూరు వైసిపి కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో శనివారం ఆ పార్టీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ శనివారం భేటి అయ్యారు. పలు సమస్యలపై వారు చర్చించారు.

నెల్లూరులో ఎంఎస్ఎంఎఫ్ పార్కుకు శంకుస్థాపన

60 ఎకరాల్లో ఏర్పాటుకు సన్నాహాలు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెలూర్లు రూరల్ నియోజకవర్గం అమంచర్లలో 60 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఎఫ్ పార్కుకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. దీనికి " భారత్ సిందూర్ పార్కు"గా నామకరణం చేశారు. ఇటీవల కాశ్మీర్‌లో జరిగిన హత్యాకాండను గుర్తుకు తెచ్చేలా దీనిని నిర్మిస్తున్నామన్నారు. ..భారత్ మాతాకి జై.. ఖబడ్దార్ ఖబడ్దార్ పాకిస్తాన్ అంటు నినాదాలు చేశారు. ప్రస్తుతం 60 ఎకరాల్లో పార్క్ పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధంగా ఉందని, . భవిష్యత్తులో మరింత విస్తరిస్తామన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వందలాది మంది యువతకు ఉపాధి అవకాశం లభిస్తుందన్నారు. నెల్లూరు రూరల్ అమంచర్ల పార్కు భవిష్యత్తు తరాలకు గుర్తుండేందుకు భారత్ సిందూర్ పార్క్‌గా పేరు పెట్టామన్నారు. , పాకిస్థాన్ ఉన్మాదులు భారత దేశాన్ని ఉగ్రవాదంతో బయపెట్టాలని చూస్తే ఇక్కడ బయపడేవాళ్లు లేరన్నారు.. పాకిస్తాన్ భారత దేశంతో అనేక యుద్దాల్లో ఓడినా బుద్ది రాలేదని, .. కేవలం మూడు రోజుల్లోనే భారతదేశ పౌరుషాన్ని పాకిస్తాన్‌కు చూపించారన్నారు. .పాకిస్తాన్‌పై భారత దేశం పూర్తి స్థాయి యుద్ధం ప్రకటిస్తే ఒక్క రాత్రిలోనే ప్రపంచ పటం నుంచి తుడిచిపెట్టుకు పోతుందన్నారు. పాకిస్తాన్‌తో యుద్ధంలో అమరుడైన మురళీ నాయక్ త్యాగాన్ని ఎప్పటికి మరచిపోమని ఎంఎల్ఎ అన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ శ్రీధర్‌రెడ్డి

క్రీడా పోటీలు నిర్వహణ అభినందనీయం

ప్రజాశక్తి-నెల్లూరు

నిరంతరం శ్రమలో పని ఒత్తిడిలో కుటుంబ బాధలలో నిమగ్నమై పనిచేసే ఉద్యోగులు కార్మికులకు ఆటల పోటీలు నిర్వహించడం ఎంతో సంతోషదాయకంగా ఉందని మేయర్ స్రవంతి జయవర్ధన్ అన్నారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో నగరపాలక సంస్థలో పనిచేయుచున్న పర్మినెంట్ ఉద్యోగులు ఆప్కాస్ ఉద్యోగులకు ఆటలు, పాటల పోటీల కార్యక్రమాలను నిర్వహించడంలో భాగంగా శనివారం సాయంత్రం స్థానిక ఏసీ నగర్ ఎలిమెంటరీ స్కూల్ ప్రాంగణం వద్ద నిర్వహించారు. ముగ్గుల పోటీలు మ్యూజికల్ చైర్స్ లెమన్ స్పూన్ పాటలు డాన్స్ తదితర పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో అత్యధిక సంఖ్యలో మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. పోటీలను నగర మేయర్ పొట్లూరి స్రవంతి జయవర్ధన్ ప్రారంభించారు. ముందుగా వీర జవాన్ పి మురళి నాయక్ కు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. దేశ సరిహద్దుల్లో శత్రువుల బారి నుండి ప్రజలను దేశాన్ని కాపాడేది వీర జవాన్లని అన్నారు.ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్ బీ మాట్లాడుతూ కష్టించి పనిచేసే పారిశుద్ధ్య మహిళలలో వున్న అద్భుతమైన ప్రతిభను పోటీల సందర్భంగా వెలికి తేయడం జరుగుతుందన్నారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నెల్లూరు నగర గౌరవ అధ్యక్షులు కత్తి శ్రీనివాసులు, సిఐటియు నగర కార్యదర్శి జి నాగేశ్వరరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం నగర గౌరవాధ్యక్షులు పి.సూర్యనారాయణ, ఐద్వానగర అధ్యక్ష కార్యదర్శులు కత్తి పద్మ,ఎన్. వి.సుబ్బమ్మ, సంపూర్ణమ్మ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, ఎం అశోక్,మట్టిపాటి శ్రీనివాసులు, జి కామాక్షమ్మ, టి.భాగ్యమ్మ జి. కొండమ్మ,టి సలోమి, మనోజ్,తాళ్లూరి రమేష్, శివ,షఫీ, సురేంద్ర పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మేయర్ పి స్రవంతి

హ్యాండ్‌లూమ్..టెక్స్‌టైల్స్ ఎడి కార్యాలయం నిర్మించాలి

ఆప్కో స్థలంలో

ప్రజాశక్తి-నెల్లూరు : నగరంలోని గాంధీనగర్ ప్రాంతంలోని ఆప్కో స్థలంలో ఉన్న షెడ్డులను గత ప్రభుత్వం కూల్చివేసి ఇతరులకు కేటాయించిందని, దానిని రద్దు చేసి చేనేత పార్కు, చేనేత అనుబంధ సంస్థలకు ఉపయోగపడే విధంగా చేనేత సహకార సంస్థలకు, హ్యాండ్‌లూం.. టెక్స్‌టైల్స్ ఏడి కార్యాలయ నిర్మాణం చేపట్టే విధంగా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఏపి చేనేత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ కటికాల వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. శనివారం దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని క్యాంపు కార్యాలయం లో కలిసి ఈ మేరకు ఒక వినతిపత్రం అందజేశారు.

పరిశ్రమల ఏర్పాటుకు పెద్దపీట

ప్రజాశక్తి-నెల్లూరు : రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అగ్రతాంబూలం వేస్తుందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. శనివారం సాయంత్రం నెల్లూరు నగరంలోని భగత్ సింగ్ కాలనీ ఎదురుగా ఎపిఐఐసి ఎంఎస్ఎంఈ పార్కు వద్ద రూ. 12 కోట్లతో నిర్మిస్తున్న ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ కు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో 175 నియోజ కవర్గాల్లో పారిశ్రామికవాడలనుఅభివృద్ధి చేసి చిన్న మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ,ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి ,నగర కమిషనర్ నందన్ , ఆర్‌డిఒ అనూష ,ఎపిఐఐసి జోనల్ మేనేజర్ శివకుమార్ అధికారులు ఉన్నారు.

దేశ రక్షణ నిధికి విరాళం అభినందనీయం

ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-కందుకూరు : దేశ రక్షణ నిధికి కాకుమాని ప్రవీణ్ కుమార్ రూ.25,000 విరాళం ఇవ్వడం అభినందనీయమని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం కందుకూరు టిడిపి కార్యాలయంలో శ్రీ సత్య సాయి జ్యువెలర్స్ యజమాని కాకుమాని ప్రవీణ్ కుమార్ ఈ విరాళాన్ని చెక్కు రూపంలో ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావుకి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఇంటూరి మాట్లాడుతూ దేశ రక్షణ కోసం 24 గంటలూ అప్రమత్తంగా ఉండే మన సైనికుల ధైర్య సాహసాలను మనం ఎప్పటికీ మరిచిపోవద్దన్నారు..కాకుమాని ప్రవీణ్ కుమార్ గారు మాట్లాడుతూ, 1971లో భారత్ , పాకిస్తాన్ యుద్ధ సమయంలో అన్న ఎన్టీఆర్ ఏర్పాటు చేసిన నిధిని గుర్తు చేసుకుంటూ, ఆయన స్ఫూర్తితోనే నేను ఈ విరాళాన్ని అంద చేస్తున్నానన్నారు.కొత్తూరు వెంకట సుధాకర్, తాత లక్ష్మీనారాయణ, కోట వెంకట నరసింహం,పబ్బిశెట్టి వరద రాజ, కోటా కిషోర్, ఇమ్మడిశెట్టి సుబ్బరాయుడు, చక్కా వెంకట కేశవరావు, కంకణాల వెంకటేశ్వర్లు, కొత్త నరేంద్ర, ఇన్నమూరి నరసింహ, కటకం నరసింహారావు, గుర్రం అల్లూరయ్య, ఇస్కాల మధు, మద్ది ప్రసాద్, చల్లగాలి కిషోర్ ఉన్నారు.

ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావుకు చెక్కు అందజేస్తున్న ప్రవీణ్

ఉద్యోగాలకు 'ప్రకాశం' విద్యార్థులు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరులోని ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం మల్టీ నేషనల్ సంస్థ వర్చూసా ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ విజయవంతంగా నిర్వహించారు. . కెపిఒ అనాలిస్ట్ (హైదరాబాద్) ఉద్యోగాల కోసం జరిగిన ఈ డ్రైవ్‌లో ఈసిఇ, సిఎస్ఇ, ఇఇఇ, సైబర్ సెక్యూరిటీ, ఏఐ శాఖలకు చెందిన 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మూడు దశల్లో జరిగిన ఎంపిక ప్రక్రియలో 11 మంది విద్యార్థులు విజయాన్ని సాధించారు.కరస్పాండెంట్ డా. కంచర్ల రామయ్య మాట్లాడుతూ ప్రపంచ స్థాయి కెరీర్ అవకాశాలను అందించేలా మా విద్యార్థుల్ని తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. ఈ విజయం తమ స్థిరమైన శిక్షణా మిషన్‌కు నిదర్శనం. విజేతలకు హృదయపూర్వక అభినందనలు అన్నారు. సాంకేతిక డైరెక్టర్ డా. కె. విజయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ మా కళాశాల సాంకేతికత, నైపుణ్యాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోంది. ప్రతిసారీ మార్కెట్‌కు అనుగుణంగా శిక్షణను అందించడమే తమ విధానమన్నారు. ప్రిన్సిపాల్ డా. చదలవాడ రవి కుమార్, వైస్ ప్రిన్సిపాల్ వి. హరి బాబు మాట్లాడారు.డ్రైవ్‌ను విజయవంతంగా నిర్వహించిన ప్లేస్‌మెంట్ అధికారి ఎన్.ఎల్. సాహిత్య తో పాటు, అకాడమిక్ ఇన్చార్జి షేక్ నాగుల మీరవలి, ప్లేస్మెంట్ కోఆర్డినేటర్లు నల్లూరి సుమలత, సి.హెచ్. భరద్వాజ్ లకు యాజమాన్యం అభినందనలు తెలిపింది.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

'రంజనా నీరుల'కు నివాళి

ప్రజాశక్తి-నెల్లూరు : ఆలిండియా ఆశా వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపకురాలు రంజనా నీరుల 4వ వర్ధంతి కార్యక్రమాన్ని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ రంజనా నీరుల 1945 లో జన్మించిన ఆమె యుఎస్ఏలో ఉన్నత విద్యనభ్యసించే సమయంలో వియత్నం యుద్ధ సమయంలో వాపక్ష ఉద్యమం పట్ల ఆకర్షితురాలయ్యారన్నారు. 1980లో ది వాయిస్ ఆఫ్ వర్కింగ్ ఉమెన్ పత్రిక ఎడిటర్‌గా పనిచేశారన్నారు. మహిళల సమాన హక్కుల సాధన కోసం రాజీ లేని పోరాటాలు చేశారన్నారు.కార్యక్రమంలో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి ఎస్.మధుసూధన, జె.పెంచలమ్మ, సరిత, ఉషా, మాదవి, స్వర్ణ , ఆటో యూనియన్ నాయకులు మారుపోయిన రాజ పాల్గొన్నారు.

రంజనా నీరుల చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

కష్టపడేవారికి ప్రాధాన్యత : బుర్రా

ప్రజాశక్తి-కందుకూరు : వైసిపి రాష్ట్ర మునిసిపల్ వింగ్ జాయింట్ సెక్రటరీగా దాసరి మాల్యాద్రి నియామకం పార్టీకి శుభ పరిణామం అని కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుర్రా బుర్రా మధుసూదన్ యాదవ్ పేర్కొన్నారు. కష్టించి పని చేసే ప్రతి ఒక్కరిని పార్టీ అధినేత జగన్ గుండెల్లో పెట్టి చూసుకుంటారని తెలిపారు. శనివారం పామూరురోడ్ లోని కార్యాలయానికి విచ్చేసిన బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ యుద్ధంలో మురళీ నాయక్ చూపించిన తెగువ, ఆయన త్యాగం దేశంలోని ప్రతి పౌరునికీ స్ఫూర్తిని స్తుందన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర మున్సిపల్ వింగ్ జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన దాసరి మాల్యాద్రిని దశ్శాలువతో సత్కరించారు. జిల్లా జనరల్ సెక్రెటరీ తోకల కొండయ్య, జిల్లా అధికార ప్రతినిధి ముప్పవరపు కిషోర్, రాష్ట్ర బూత్ కమిటీ జాయింట్ సెక్రెటరీ గణేశం గంగిరెడ్డి, జిల్లా సెక్రెటరీ చీమల వెంకటరాజా, జిల్లా ఉపాధ్యక్షులు బిల్లా రమణయ్య, కందుకూరు మండల అధ్యక్షులు ఈదర రమేష్, ఐటి వింగ్ అధ్యక్షులు అమరనాథరెడ్డి ఉన్నారు.

నేడు అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి -గుడ్లూరు : అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయులు గుడ్లూరు లో ప్రారంభిస్తారని అంబేద్కర్ యూనియన్ కమిటీ వారు శనివారం వెల్లడించారు. ఎపి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ విజయకుమార్, రాష్ట్ర ఆరోగ్య మండలి చైర్మన్ డాక్టర్ దగ్గు బాటి డాక్టర్ శ్రీహరిరావు హాజరవుతారన్నారు. గ్రామ సర్పంచి పాలకీర్తి శంకర్ మం డల టిడిపి నాయకులు సహకారంతో విగ్రహావిష్కరణ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

'మాలకొండ'లో భక్తుల సందడి

ప్రజాశక్తి - వలేటివారిపాలెం : అయ్యవారిపల్లి పంచాయతీలో కొలువుదీని మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి దర్శించుకొనేందుకు శనివారం రాష్ట్రం నలుమూలలనుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు.. ఈ శనివారం భక్తుల ద్వారా వివిధ రూపాలలో దేవస్థానం నకు వచ్చిన ఆదాయం రూ.1273205 ఆదాయం వచ్చినట్లు ఉపకమిషనర్, ఆలయకార్య నిర్వాహనాదికారి. కె. వి. సాగర్ బాబు తెలిపారు.

సిఐ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-నెల్లూరు : ఐదో నగర పోలీసు స్టేషన్ సిఐగా కాటూరి శ్రీనివాసరావును నియమిస్తూ డిజిపి ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.వేదాయ పాళెం పోలీసు స్టేషన్ పరిధిలో ఇటీవల కాలంలో హత్యలు ఎక్కువగా చోటు చేసుకోవడం, శాంతి భద్రతలు పరిరక్షించడంలో వైఫల్యం చెందారన్న కారణంతో అప్పటి వరకు సిఐగా పనిచేస్తున్న అధికారిని బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో కాటూరి శ్రీనివాసరావును సిఐగా నియమిస్తూ డిజిపి కార్యాలయం ఉత్తర్వులు విడుదల చేసింది. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఘనంగా సీతారాముల కళ్యాణం

ప్రజాశక్తి-ఉలవపాడు : మండలంలోని పెదపట్టపుపాలెం పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం గ్రామంలో భక్తిశ్రద్ధలతో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ,శ్రీ సీతారాముల ఆశీస్సులతో నియోజ కవర్గంలోని ప్రజలందరూ ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించాచరు.



వ్యక్తిగత విమర్శలొద్దు..: టిడిపి

ప్రజాశక్తి-బిట్రగుంట

టిడిపి నాయకులను వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని మండల టిడిపి మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. వైసిపి నాయకుల విమర్శలకు వ్యతిరేకంగా శనివారం మండల టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు ఎల్.సుధీర్ బాబు, యువత నాయకులు పైడి హర్ష, నెల్లూరు పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాయి విజయ్ యాదవ్ మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో ఎస్‌సి బలగాలను అడ్డం పెట్టుకొని టిడిపి కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారని తెలిపారు. బోగోలు 16 పంచాయతీలను మీ చేతిలో పెట్టిన టిడిపికి మెజార్టీ రాజకీయ సన్యాసం తీసుకుంటానని మీరు చెప్పలేదా అని, మీరు చేసిన సవాళ్లు మర్చిపోయారని, తమ నాయకుని పట్టుకొని రౌడీలు అంటున్నారని, తమ ప్రభుత్వం వచ్చి పది నెలైనా ఏ ఒక్క వైసిపి కార్యకర్తపైన కేసు నమోదు చేయడం గాని వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలు గానీ మండలంలో ఎక్కడా జరగలేదన్నారు. తమ నాయకుడు కావ్య కృష్ణారెడ్డి ఒక టీచర్ వృత్తి నుండి వచ్చిన వ్యక్తి తమ కాబట్టి శాంతిని కోరుకుంటున్నారని, వైసిపి ప్రభుత్వంలో ఎన్ని అక్రమ కేసులు భరాయించి టిడిపి కార్యకర్తలను నాయకులను జర్నలిస్టులను వేధించారని తెలిపారు. విమర్శలు చేసే ముందు అందుకు మనకు అర్హత ఉందా.. లేదా.. అని తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కాంట్రా రఘురాం నాయుడు, రామ్మోహన్ రెడ్డి, బోగిని ప్రభాకర్, వెంకటేశ్వర్ రెడ్డి, ఆవుల సురేష్, హరి బాబు, రఫీ, టిడిపి సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఉదయగిరి

మండల పరిధిలోని అప్పసముద్రం గ్రామ పంచాయతీలోని మసీదుపల్లి గ్రామంలో రూ.4లక్షల పంచాయితీ నిధులతో నూతన వాటర్ ప్లాంట్ నిర్మాణానికి సర్పంచ్ చేజర్ల నాగరత్నమ్మ మాజీ ఎంపిపి, వైసిపి స్టేట్ పబ్లిసిటీ వింగ్ వైస్ ప్రెసిడెంట్ చేజర్ల సుబ్బారెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ నిర్మాణంపై గ్రామస్తులు వారికి అభినందనలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ జగన్నాథం పంచాయతీ కార్యదర్శి శేఖర్ రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉప్పుటూరి వెంకటేశ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయరూ..

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

అంధకారంలో ఉన్న వీధులు

మండలంలోని అనుమసముద్రం గ్రామపంచాయతీకి సంబంధించిన గవర్నమెంట్ హాస్పిటల్ నుంచి విజిఆర్ సుబ్బారెడ్డి మిల్లు వరకు ఉండే దారి అంధకారం అలముకుని ఆ దారిన వెళ్లాలంటే రాత్రి సమయాల్లో చాలా ఇబ్బందిగా ఉందని ఏదైనా ఆరోగ్య పరిస్థితిలో బాగో లేనప్పుడు రాత్రి వేళలో ఆ కటిక చీకటిలో హాస్పిటల్‌కి వెళ్లాలంటే ఏ సమయంలో ఏమి జరుగుతుందోనని అనుమసముద్రం, వినాయక సెంటర్ ఏరియా గ్రామస్తులు, ఎఎస్‌పేట గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. అంతేకాకుండా ఆ దారిలో వెళ్లాలంటే ఎక్కువగా కంపచెట్లు అటు చుట్టుపక్కల ఇల్లు కూడా ఎక్కువగా లేకపోవడంతో ఆ ఏరియా అంతా విష సర్పాలకు తావు అయినటువంటి ప్రదేశం కాబట్టి ఇకనైనా ఈ విషయాన్ని అధికారులు, పంచాయితీ పాలకులు గమనించి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

'అన్నదాత సుఖీభవ'కు మార్గదర్శకాలు

ప్రజాశక్తి-కలిగిరి

2025-26 సంవత్సరానికి గానూ ప్రభుత్వం వారు అన్నదాత సుఖీభవ పథకానికి మార్గదర్శకాలు విడుదల చేశారు. సంవత్సరానికి ఒక రైతు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.14వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.6వేల చొప్పున మొత్తం రూ.20వేలు సాగు ఖర్చులకు జమ చేస్తుంది. ప్రతి రైతు సేవాకేంద్రంలో దీనికి సంబంధించిన డేటా వెరిఫికేషన్ 20.5.25 వరకు ఆన్లైన్లో అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో రైతు సేవా కేంద్రం సహాయకులు నమోదు చేస్తారు.

విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలోని సాతువారిపల్లె గ్రామంలో గ్రామస్తులతో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీ సీతారామ, లక్ష్మణ, హనుమంతు సమేతంగా జరుగుతున్న విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్ పాల్గొని స్వామివారికి కర్పూర హారతులు అందజేశారు. యాగశాలలోని నవగ్రహ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా ఆలయ అర్చకులు గ్రామస్తులు నాయకులు ఎంఎల్‌ఎకు ఘన స్వాగతం పలికారు. శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం నందమూరి తారక రామారావు నూతన విగ్రహాన్ని ఆవిష్కరించి టిడిపి జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చంద్ర మధుసూదన్ రావు, మాజీ మండల కన్వీనర్ చంద్ర వెంకయ్య, తెలుగు యువత అధ్యక్షులు ముజ్జే లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ యాదవ్, జడ్పిటిసి నాగేంద్ర, టిడిపి నాయకులు పేరం సుధాకర్ రెడ్డి, ప్రభాకర్ నాయుడు, పోద మాధవ, గుంటూరు తిరుపతయ్య, శివరామయ్య, చెక్క మాధవరావు, కొండలరావు యాదవ్, పోక మహేష్, మాలెం హజరత్ రెడ్డి, పందిటి శ్రీనివాసులు, కొనిగిపోగు వెంగయ్య ,లోకసాని రవి, వెంకటరత్నం, డేవిడ్, గ్రామ నాయకులు భక్తులు ఉన్నారు.

జెవివి ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-కావలి

మాట్లాడుతున్న జెవివి నాయకులు

జిల్లా జనవిజ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో కావలి పట్టణంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ - కావలి బ్రాంచ్ ప్రాంగణంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఎన్.వి.సి. ఉదయ్ భాస్కర్ అధ్యక్షతన "జన విజ్ఞాన వేదిక జిల్లాలోని కార్యకర్తలకు సైన్స్ అవగాహనా శిక్షణ తరగతులు" నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులలో డాక్టర్ కలేషా భాషా - శాస్త్రీయ దృక్పథం - సవాళ్లు, ఎం.వి. చలపతి - జీవ పరిణామం, డాక్టర్ సుధాకర్ రెడ్డి - "వాతావరణ మార్పులు - వడగాల్పుల తీవ్రత", ఎన్. శంకరయ్య - "ప్రజా సైన్స్ ఉద్యమ నిర్మాణం" తదితర విషయాలు మీద చాలా చక్కగా విషయ అవగాహన చేస్తూ వివిధ ఆడియో, వీడియో, డేమో క్లిప్పింగ్స్‌తో బోధిస్తూ సభ్యుల ప్రశ్నలు వివిధ ప్రశ్నలు, అనుమానాలను చాలా చక్కని ఉదాహరణల ద్వారా నివృత్తి చేస్తూ వాస్తవ ప్రపంచంలో ప్రతినిత్యం ప్రజలు పాటించే ఆచార వ్యవహారాలు, సమాజ కట్టుబాట్లు, ఆహారపు అలవాట్లు, ప్రకృతిలో జరుగుతున్న మార్పులు, ప్రాచీన చరిత్ర, అనుభవాల ద్వారా మనం నేర్చుకోవాల్సిన విషయాలు మొదలైన విషయాలను గురించి తమ అమూల్యమైన, సందేశాత్మక బోధన చేశారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణారెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి మాదాల రాము, రాష్ట్ర నాయకులు ఎన్.శంకరయ్య, ఎ.విజయ్ కుమార్, జిల్లా కార్యదర్శులు పి.జానకిరామ్, వి.మాధవ, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.కళ్యాణి, జిల్లా నాయకులు ఆకుల రమణయ్య, లోక్ సత్తా రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి, యు.టి.ఎఫ్. రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు బి.శ్రీదేవి, సీనియర్ యు.టి.ఎఫ్ నాయకులు అజయ్ సంపత్ కుమార్, కావలి పట్టణ కార్యదర్శి గాదిరెడ్డి హరినాథ్, ట్రెజరర్ టి.సుబ్బరామశర్మ, ఉపాధ్యక్షులు చాకలకొండ శారద, షేక్ ఖాదర్ భాషా, కె.హరినారపరెడ్డి, జాయింట్ సెక్రటరీ గాదిరెడ్డి మురళీకష్ణ, అమిరిశెట్టి హాజరత్తయ్య, సభ్యులు కె.జాన్, మొగిలిశెట్టి జమున, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

'విలేజ్ క్లినిక్ - ఫ్యామిలీ డాక్టర్' విధానాన్ని కొనసాగించాలి

ప్రజాశక్తి-కావలి

అధికారంలో ఏ పార్టీ ఉన్నా.. గత ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ప్రజాప్రయోజనకర విధానాలను కొనసాగిస్తే ప్రజాభిమానాన్ని పొందినట్లేనని, ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వం పేద ప్రజలకోసం ఏర్పాటుచేసిన "విలేజ్ క్లినిక్ - ఫ్యామిలీ డాక్టర్" విధానాన్ని కొనసాగించాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయిని, మహిళా సామాజిక కార్యకర్త చాకలకొండ శారద ప్రకటనలో కూటమి ప్రభుత్వాన్ని కోరారు. దానివల్ల గ్రామాల్లో ప్రజలకు సులువుగా వైద్యం తక్షణమే అందుతుందన్నారు. దగ్గు, జలుబు, జ్వరం, బిపి, షుగర్, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఎంతో మేలుచేసినట్లవుతుందన్నారు. ఏరియా వైద్యశాలలకు వెళ్లే అవసరం వచ్చేదాకా.. విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ వైద్యులు గ్రామీణ వ్యాధిగ్రస్తులకు తక్షణ వైద్య సహాయం అందించే వీలుంటుందని తెలిపారు. కనుక తక్షణమే "మూతబడిన విలేజ్ క్లినిక్స్"ను గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి తెస్తే, ప్రభుత్వం ప్రజలకు దగ్గరవుతుందన్నారు. పేదలు ప్రయోజనం పొందుతారన్నారు.

రేపు అన్నమాచార్య స్వరార్చన

ప్రజాశక్తి-కావలి

తొలిపద కవితా పితామహుడుగా రాగయుక్తంగా సంగీతాన్ని జోడిస్తూ, శ్రీహరిని ఆయన భక్తులను తరింపజేసిన తొలి వాగ్గేయ కారకుడైన తాళ్లపాక అన్నమయ్య 617వ జయంతి 12వ తేదీన కావలికి చెందిన గణపతిరాజు మారుతీరామారావు, టంగుటూరి జయశ్రీ "స్వరార్చన" పేరుతో కావలిలో నిర్వహిస్తున్నారు. ఇలాంటి మంచి కార్యక్రమానికి అన్నమయ్య అభిమానులు సంగీత ప్రియులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. 12న సోమవారం సమయం సాయంత్రం 4 గంటలకు వేదిక సంకల వారి తోట వాయినందన ప్రెస్‌వీధిలోని రామాలయంలో అని, ఎలాంటి వయోపరిమితి లేదు, అందరూ ఆహ్వానితులేనని 9441852 050: 9491688037 నెంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చెసుకోవాలని తెలిపారు.

విద్యార్థినిని అభినందిస్తున్న జెవివి నాయకులు

జెడ్‌పి విద్యార్థినికి అభినందనలు

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సంస్థ గౌరవ అధ్యక్షులు, సీనియర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ చేతుల మీదగా కావలి రూరల్ మండలంలో 10వ తరగతి (ఎస్.ఎస్.సి)-2025 పరీక్ష ఫలితాలులో జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల -సర్వాయపాలెంలో చదివిన విద్యార్థిని ఐ.జ్యోత్స్నకు 592/600 మార్కులు సాధించిన సందర్భంగా జన విజ్ఞాన వేదిక కావలి పట్టణశాఖ నగదు బహుమతి ఇచ్చి, సత్కరించింది. జె.వి.వి. నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇదేవిధంగా కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో నిలవాలని అభినందించారు. కారర్యక్రమంలో జెవివి నాయకులు షేక్.ఖాలేషా బాషా, ఎన్.శంకరయ్య, పి.జానకిరామ్, టి.సుబ్బరామ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

బాలికల వికాసంపై అవగాహన

ప్రజాశక్తి-కావలి

కావలి అరుంధతీయపాలెం 1, 2 అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో శనివారం కిశోరీ వికాశం - మాతృవందనం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐ.సి.డి.ఎస్. సిడిపిఒ సౌజన్య, సూపర్‌వైజర్ సుహాసిని ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 2వ తేదీ నుండి 10వ తేదీ వరకు కిశోరీ వికాసం వారోత్సవాలు జరుపుతున్నామని తెలిపారు. అదేవిధంగా ఆదివారం "మదర్స్ డే" సందర్భాన్ని పురస్కరించుకుని మాతృవందనం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కిశోరీ బాలికలకు ఎదిగే వయసులో 9 రకాల సమస్యలుంటాయని, వాటిగురించి కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. తల్లిని గౌరవించాలని, తల్లి దీవెనలు పిల్లలకు అవసరమని, వారిని పూజించాలని అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులకు తెలియబరిచారు. కార్యక్రమంలో తల్లులు, కిశోర బాలికలు, చిన్నారులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రోత్సాహక బహుమతులు అందజేత

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణంలో నూర్‌బాషా (దూదేకుల) సంఘం కావలి మండల కార్యవర్గ సమావేశం శనివారం జిల్లా అధ్యక్షులు షేక్ సలీమ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో 2024-2025వ విద్యా సంవత్సరంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన నూరుభాషా విద్యార్థులకు రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు యాదవ్ సహకారంతో బి.ఎం.ఆర్. చారిటబుల్ ట్రస్ట్ తరపున ప్రోత్సాహక బహుమతుల కార్యక్రమం నిర్వహించబడుననని తెలియజేశారు. కావలి మండలం, కావలి డివిజన్ పరిధిలో పదవ తరగతిలో 500మార్కులు, ఇంటర్మీడియట్‌లో 900లకు పైబడిన నూర్ భాషా విద్యార్థులు వారి మార్క్‌లిస్ట్, క్యాస్ట్ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్ వివరాలను కావలి మండలానికి సంబంధించి కావలి మండల అధ్యక్షులు షేక్ ఖలీల్‌కు మే 30వ తేదీలోపు అందజేయాలన్నారు. వచ్చిన అప్లికేషన్‌లను పరిశీలించి, తదుపరి ప్రతిభ ప్రోత్సాహక బహుమతుల తేదీని అందరికీ తెలియజేస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీద మస్తాన్ రావు, ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర నాయకులు, ప్రభుత్వ అధికారులు హాజరవుతారని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు షేక్.సలీమ్, ప్రధాన కార్యదర్శి షేక్ మీరా సాహెబ్, యూత్ నాయకులు షరీఫ్, కావలి మండల అధ్యక్షులు ఖలీల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ చాంద్ బాషా, మీడియా ప్రతినిధి షాన్ వాజ్, నూర్ భాషా నాయకులు బాదుల్లా, షేక్ గౌస్ (రిటైర్డ్ టీచర్) కాలేషా, మస్తాన్ భాయ్, టిడిపి నాయకులు షేక్. హజరత్ పాల్గొన్నారు.

ఆలయం అభివృద్ధికి కృషి

- మాజీ చైర్మన్ ఎల్ సి కొండారెడ్డి

ప్రజాశక్తి-వింజమూరు

మండల పరిధిలోని నల్లగొండ గ్రామంలో వెలసి ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం అభివృద్ధి తమ లక్ష్యమని ఆలయ మాజీ చైర్మన్ ఎల్ సి కొండారెడ్డి అన్నారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం పూజా కార్యక్రమంలో భాగంగా ఉభయకర్తలుగా చేజర్ల చలమారెడ్డి - మాధవి దంపతులు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం పూజా కార్యక్రమంలో భాగంగా ఉభయకర్తలుగా అంకినపల్లి ఓబుల్ రెడ్డి - గిరిజా దంపతులు తూర్పు వీధి గారు నిర్వహించారు. రాత్రికి భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. సాంస్కృతి కార్యక్రమంలో భాగంగా కోలాటాలు పండరి భజనలు భక్తులందరినీ కనువిందు చేసే విధంగా నిర్వహించారు. అనంతరం పత్రికా విలేకరులతో మాజీ చైర్మన్ ఎల్‌సి కొండారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న బ్రహ్మోత్సవాలు 9వ తేదీ నుండి 17వ తేదీ వరకు జరుగుతాయని ప్రతిరోజు ఉభయకర్తలు భక్తులు అందరూ కలిసి అంగరంగ వైభవంగా ఆలయ అభివృద్ధి కోసం పాటుపడే విధంగా ఉత్సవాల నిర్వహిస్తున్నారన్నారు. ఈ ఆలయ నిర్వహణ కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు ఆలయం ఆదాయం రాబడి సుమారుగా రూ.15 లక్షలు ఉండగా ఖర్చు మాత్రం రూ.35 లక్షల పైగా అవుతుందని తెలిపారు. కావున ఈ ఆలయ అభివృద్ధి కోసం తనవంతుగా అందరూ సహకారం తీసుకొని జిల్లాలో పేరుగాంచిన పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దాలని సంకల్పంతో ఉన్నారన్నారు. ఈ ఆలయ అభివృద్ధి కోసం రాజకీయ నాయకులు పార్లమెంటు సభ్యులు మంత్రులు ఎంఎల్‌ఎలు వారి సహాయ సహకారాలు తీసుకుంటానని తెలిపారు. అలాగే 14వ తేదీ జరుగునున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవానికి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనా రెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఉదయగిరి ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్ పాల్గొంటారని, పై ఉత్సవ కార్యక్రమాల్లో భక్తులందరూ భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరారు. గతంలో తాను చైర్మన్‌గా ఉన్న సమయంలో దేవాలయంలో పరిసరాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేశానని ఇంకా కూడా ఆలయ అభివృద్ధి కోసమే ఆంధ్ర సహకారంతో తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. భక్తులందరూ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

తల్లిదండ్రులను గౌరవించాలి

ప్రజాశక్తి-కావలి

సమాజంలో జన్మనిచ్చిన తల్లిదండ్రులను గౌరవించి, ఆదరించాలని సామాజికవేత్త ఎం.మాల కొండా రెడ్డి పేర్కొన్నారు. శనివారం తల్లికి వందనం కార్యక్రమాన్ని జనతాపేట అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో జనతాపేటలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాలకొండారెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయకుండా వృద్ధాప్యంలో వారిని గౌరవంగా పోషించాలని కోరారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల నిర్లక్ష్యం చేస్తే రక్షణగా లోక్ అదాలత్ ద్వారాసహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా జన్మనిచ్చిన తల్లులను అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో పాద పూజ నిర్వహించి గౌరవించారు. అలాగే తల్లులు చిన్నారులను ఆశీర్వదించారు. జనతాపేట అంగన్‌వాడీ కార్యకర్తలు కె.స్వర్ణ, కె.సునీత, తల్లులు పాల్గొన్నారు.

పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి ఆదురుపల్లి క్లస్టర్‌కు చెందిన రైతులు 448పొగాకు బేళ్ళను వేలానికి తీసుకురాగా వీటిలో 348బేళ్లను పలు కంపెనీలకు చెందిన వ్యాపారస్థులు కొనుగోలు చేశారనివేలం నిర్వహణ అధికారి జి.రాజశేఖర్ తెలిపారు. 97బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారని తెలిపారు. వాటిలో ఎన్ఎస్ 53, ఎన్ బి 33, ఆర్ ఆర్ 02, సిఆర్ 09ఉన్నాయన్నారు. అధిక బరువుతో ఉన్న 03 బేళ్లను వేలానికి అనుమతించ లేదన్నారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ.280, కనిష్ఠ ధర రూ.210, సగటు ధర రూ.251.84 కాగా ఈ వేలంలో 12 మంది కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలిపారు.

ఐవిఆర్‌ఎస్ కాల్‌పై అవగాహన

ప్రజాశక్తి-ఉదయగిరి

ఐవిఆర్‌ఎస్ కాల్‌పై పట్టణ ప్రజలకు ఇన్‌ఛార్జ్ డిప్యూటీ ఎంపిడిఒ షేక్ కరీముల్లా అవగాహన కల్పించారు. శనివారం స్థానిక పట్టణంలోని పలు ప్రాంతాల్లో తడి చెత్త పొడి చెత్తను సిబ్బంది సేకరిస్తున్న విధానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉదయగిరి, జి.అయ్యావారిపల్లి, గండిపాలెం, అప్పసముద్రం పంచాయతీలను మోడల్ ఐవిఆర్‌ఎస్‌గా ఎంపిక చేసామన్నారు. ఈ విధంగా సేకరించిన తడి, పొడి చెత్తలను సంపద తయారీ కేంద్రాలకు తరలించి వర్మికంపోస్టు ఎరువులు తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

వాసవి కన్యకా పరమేశ్వరీ జయంతి

ప్రజాశక్తి-సంగం

స్థానిక మెయిన్ బజార్లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి కన్యకా పరమేశ్వరీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని పరిమళ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మహిళలు కోలాటం వేసి అలరించారు.

ప్రాథమిక చికిత్సపై అవగాహన

ప్రజాశక్తి-కావలి

ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాలలో భాగంగా స్థానిక క్రిస్టియన్ పేటలోని డాక్టర్ శ్రీధర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో బేసిక్ లైఫ్ సపోర్ట్ స్కిల్స్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రయివేట్ ఆసుపత్రుల సిబ్బంది పాల్గొన్న, ఈ కార్యక్రమానికి రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు డాక్టర్ పామూరు శ్రీధర్ అధ్యక్షత వహించగా, విపత్తు నిర్వహణ శిక్షకులు బీద లక్ష్మానంద శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మానంద మాట్లాడుతూ, వివిధ రోడ్డు ప్రమాదాలలో గాయపడిన వారిని, సురక్షితంగా, సకాలంలో దగ్గరలోని ఆసుపత్రికి తరలించడం, ప్రాథమిక చికిత్స చేయడంపై వివరించారు. ఎటువంటి వైద్య పరికరాలు లేకపోయినా అందు బాటులో ఉన్న కర్రలు, దుప్పట్లను స్ట్రెచెర్‌గా ఉపయోగించడం, అవికూడా లేనప్పుడుచేతులతోనే ఎత్తుకుని సురక్షిత ప్రాంతానికి చేర్చడం ప్రదర్శనా పూర్వకంగా వివరించారు. గుండె, ఊపిరితిత్తులు ఆగిపోయినప్పుడు 4నిమిషాల లోపల సిపిఆర్ (కార్డియో పల్మనరీ రెసుసైటేషన్) ప్రక్రియ ద్వారా మనిషిని బతికించవచ్చని అన్నారు. ఈ ప్రక్రియను ఆసుపత్రుల సిబ్బందితో పాటు ఇంటికి కనీసం ఒక్కరు నేర్చుకోవాలని లక్ష్మానంద పేర్కొన్నారు. కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి రవిప్రకాష్, వైస్ చైర్మన్ కె హరినారప రెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూదన్ రావు, పాలకమండలి సభ్యులు ఎస్‌కె.అబ్దుల్ నయీమ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కళ్యాణోత్సవం

ప్రజాశక్తి-దుత్తలూరు : మండలంలోని ముత్తరాసిపల్లిలో కన్నుల పండుగగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటిగా ఆలయ ధర్మకర్తలు మెంతెం వెంకటేశ్వర్లు రెడ్డి, భాగ్యమ్మ దంపతులు ఇంటి నుండి మేళ వాయిద్యాలతో సీతారాముల స్వామివారికి పట్టువస్త్రాలు ఆభరణాలు సమర్పించి, తదుపరి సీతారాముల వారికి కల్యాణం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి అన్నదానం నిర్వహించారు. దేవస్థానం కమిటీ సభ్యులు మధు, శ్రీనివాసులు రెడ్డి, మల్లికార్జున్, ప్రసన్న, శరత్, బాలకృష్ణ, సురేష్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తీరప్రాంతాల్లో అప్రమత్తత

ప్రజాశక్తి-నెల్లూరు

దేశ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు యంత్రాంగం తీర ప్రాంతాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు సముద్ర తీర ప్రాంతంలో ఉన్న కృష్ణపట్నం పోర్టు, ఎపి జెన్కో ప్రాంతాల్లో సంబంధిత శాఖ అధికారులతో ఎస్‌పి అత్యవసర సమావేశం నిర్వహించారు. తీర ప్రాంతంలో నిఘా కట్టుదిట్టం చేశారు. అదే సమయంలో పోర్టు ప్రాంతంలో భద్రతను మరింత బలోపేతం చేస్తూ పోలీసు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. పాక్ నిర్వహించిన దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన భారత సైనికుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నగర ప్రజలు ఘన నివాళి అర్పించారు. పాక్ చర్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రాణాలు కోల్పోయిన భారత సైనిక కుటుంబాలకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

వీక్షణం

ఈ నెల 20 తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టి సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాలు జిల్లా వ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సుల్లో కార్మికులు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం కోడ్‌లుగా మార్పు చేసి, కార్పోరేట్ శక్తులకు లాభం చేకూరే విధంగా కోడ్‌లను రూపొందించడాన్ని దారుణమంటూ కార్మిక సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఆప్కాస్ విధానంలో పనిచేస్తూ 60యేళ్ల వయస్సు నిండిన మున్సిపల్ కార్మికులను కార్పొరేషన్ అధికారుల విధుల నుంచి తొలగించడం, ముందస్తు సమాచారం అందజేయకుండా ఇటువంటి చర్యలకు పాల్పడటం దారుణమంటూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ నాయకులు ఆందోళన కార్యక్రమాలు నగరంలో నిర్వహిస్తున్నారు. మున్సిపల్ కార్మికులుగా ఎన్నో యేళ్ల నుంచి పనిచేసి ప్రభుత్వం నుంచి ఎటువంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ పొందకుండా నిర్దాక్షణ్యంగా విధుల నుంచి తమను తొలగించడం దారుణ మంటూ 93 మంది కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందిచి కార్మికులకు న్యాయం చేయా లని, వారి కుటుంబం లో ఒకరికి ఉద్యోగావకాశాలు కల్పించి ఆదుకోవాలని ప్రజలు సైతం కోరుకుం టున్నారు. మే డే వారోత్సవాల్లో భాగంగా కార్మిక సంఘాలు కార్మికులకు క్రీడా పోటీలు నిర్వహించి వారిలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని బహిర్గతం చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ క్రీడా పోటీలను నిర్వహించడాన్ని ప్రజానీకం అభినందిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - దేవదాయధర్మదాయశాఖ
శ్రీ అంకమ్మ మరియు నాంచారమ్మ తల్లి దేవస్థానము
కందుకూరు పట్టణం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

ఈ టెండరు కమ్ సీల్డు టెండర్ కమ్ బహిరంగ వేలము
షెడ్యూలు

ఆర్.సి.నెం.2/పిఓఇ - 19023 (32) 2/2025 **తేది: 10-05-2025**

కందుకూరు గ్రామం సర్వే నెం.865/16 లోకి 1 × 24 షాపులుగా విభజించి 11 సంవత్సరముల కాలమునకు లీజు హక్కులను పొందుటకు షెడ్యూలు ప్రకారము ఈ-టెండర్ కమ్ సీల్డు టెండర్ కమ్ బహిరంగ వేలము పాటలు నిర్వహించబడును. ఈ టెండరు దాఖలు చేయుటకు ఆఖరు **తేది: 24-05-2025 ఉదయం 8.00 గంటల**లోపు మరిన్ని వివరములకు **https:tenderapeprocurment.gov.in** ను సందర్శించగలరు. సీల్డు టెండర్లు **తేది: 10-05-2025 నుండి 24-05-2025 ఉదయం 8.00 గంటల లోపల** షెడ్యూలు 9B ప్రకారం **రూ.1000/-** చెల్లించి పొందగలరు. పూర్తి చేసిన సీల్డు టెండరు **తేది: 24-05-2025 ఉదయం 8.00 గంటల**లోపు దేవస్థానము కార్యాలయము నందలి టెండరు బాక్సునందు వేయవలెను.

బహిరంగ వేలము పాటలు **తేది: 24-05-2025 శనివారము ఉదయం 10.00 ని॥ల** నుండి డిప్యూటీ కమిషనరు దేవాదాయశాఖ గుంటూరు వారి ఆధ్వర్యములో కందుకూరు గ్రామంలోని శ్రీ జనార్ధనస్వామి వారి కళ్యాణమండపములో జరుగును. ఇతర వివరముల కోసం సెల్: **96422 44339, 93900 37136** నెంబర్లను సంప్రదించగలరు.

సం/- **కార్యనిర్వహణాధికారి**